# ఏడాదిలో తామూ అవినీతి పార్టీలేనని రుజువు చేస్తున్న బి.జె.పి., టి.డి.పి.

**– జూలై 20న నిరసనలకు వామపక్షాల పిలుపు.**

ప్రజలారా!

"అవినీతి అంతం చేస్తా. నీతిని పునరుద్ధరిస్తా. విదేశాల్లో దొంగలు దాచేసిన డబ్బు తెచ్చేస్తా. ప్రజలందరికీ పంచేస్తా." ఇది ఎన్నికల ముందు మోడీగారి ప్రచారం. ఏడాదిపాలన పూర్తయిన సందర్భంగా మోడీగారు అవినీతి లేకుండా పాలించడమే ఒక సంవత్సరంలో తాను సాధించిన విజయమని డబ్బా కొట్టుకున్నారు. పాపం అలా చెప్పిన వారం తిరక్క ముందే మోడీ మంత్రివర్గ సహచరులు, బి.జె.పి. రాష్ట్ర ప్రభుత్వాల దొంగతనం ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మోడీ ఈ అవినీతి అక్రమాలపై నోరు మెదపడంలేదు.

### లలిత్‌మోడీతో సుష్మా అవినీతి బంధం

క్రికెట్ కుంభకోణంలో పీకలదాకా మింగేసి లండన్‌కు తప్పించుకు పారిపోయిన లలిత్‌మోడీకి లండన్ నుండి పోర్చుగల్‌కు వెళ్ళేందు అనుమతి ఇవ్వాలని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ బ్రిటిష్ ప్రభుత్వానికి సిఫార్సు చేసి దొరికిపోయింది. నేరస్తుడికి సిఫార్సు ఎందుకు చేసారంటే మానవతా దృక్పదంతో అలా చేసానని మంత్రి వివరణ ఇచ్చారు. అసలు విషయం ఏమంటే మంత్రి భర్త, కూతురు, దొంగ లలిత్‌మోడీకి లాయర్లు. అందువలనే లలిత్‌మోడీని కాపాడడానికి మంత్రి పూనుకున్నారు. దేశద్రోహికి అడ్డగోలుగా కాపుకాసిన మంత్రిని బి.జె.పి. బలపరుస్తున్నది.

### తీగలాగితే వసుంధరా రాజే దొరికిపోయింది

తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఈ లలిత్‌మోడీకి లండన్ వెళ్ళడానికి వీసా కోసం బ్రిటిష్ అధికారులకు నేటి రాజస్ధాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే సిఫార్సు చేసినట్టు బయటపడింది. లలిత్‌మోడీకి తాను చేసిన సహాయం భారతీయ అధికారులకు తెలియనివ్వరాదని బ్రిటిష్ అధికారులకు వసుంధరా రాజే విజ్ఞప్తి చేసారు. తప్పుని తెలిసి కూడా ఎందుకిలా చేసారు? లలిత్‌మోడీకి చేసిన సహాయానికి ప్రతిఫలంగా తన కుమారుడు, కోడలు పేరుమీదున్న "నియాంత్ హోటల్స్" పది రూపాయల విలువగల షేర్‌ను రూ. 96,190లకు లలిత్‌మోడీ కొన్నాడు. మారిషస్‌లో గల బినామీ కంపెనీ ద్వారా ఈ లావాదేవీలు నడిపారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశానికి రప్పిస్తామన్న బి.జె.పి. పాలకుల అసలు బండారం ఇది. నల్లధనం ద్రోహులకు వీళ్ళు చుట్టాలేనని తేలిపోయింది.

### డిటెక్టివ్ నవలను మించిపోయిన "వ్యాపం" కుంభకోణం

మధ్యప్రదేశ్ బి.జె.పి. ప్రభుత్వం అవినీతి అక్రమాల పాలన భయంకరంగా ఉన్నది. మధ్యప్రదేశ్ ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ అక్రమాలకు అవధులే లేవు. ఇప్పటి వరకూ ఈ కేసులో మధ్యప్రదేశ్ మాజీ విద్యాశాఖా మంత్రితో పాటు 2000 మంది అరెస్టు కాగా మరో 800 మందిని అరెస్టు చేయాల్సి ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకూ 48 మంది సాక్షులు, ఉన్నతాధికారులు, ఇతరులు హత్యకుగాని, ఆత్మహత్యకుగాని బలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వమే 26మంది మరణాలు ఈ కేసుకు సంబంధించినవేనని అంగీకరించింది. కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ముఖ్యమంత్రి చౌహాన్ భార్య రాష్ట్ర గవర్నర్ రామ్‌నరేష్ యాదవ్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా బి.జె.పి. తమ తప్పులను కప్పిపుచ్చుకుంటున్నది తప్ప, తప్పు చేసిన వారిని పదవులనుండి తప్పించేందుకు కూడా ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు.

### చత్తీస్‌ఘర్, మహారాష్ట్ర బి.జె.పి. పాలనలో ఇదే తంతు.

మరో బి.జె.పి. పాలిత రాష్ట్రం చత్తీస్‌ఘర్‌లో పౌర సరఫరాల శాఖలో 36 వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగింది. ఎ.సి.బి. అధికారులు కార్పొరేషన్ ఆఫీసుపై దాడి చేయగా నాలుగు కోట్ల నగదుతో పాటు, పెన్ డ్రైవ్ దొరికింది. ఆ పెన్‌డ్రైవ్‌లో క్రిందినుండి పైదాకా ఎవరెవరికి ఎంత వాటా ఇవ్వాలో వివరంగా ఉంది. మహారాష్ట్రలో మహిళా శిశుసంక్షేమశాఖామంత్రి పంకజ్ ముండే చిన్న పిల్లల ఆహారాన్ని 206 కోట్లు కొల్లగొట్టింది. ఇలా బి.జె.పి. పాలనలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. అయినప్పటికీ ప్రధాన మంత్రి మూగనోము పాటిస్తున్నారు. బి.జె.పి. నాయకులంతా అవినీతి పరుల కొమ్ముకాస్తున్నారు.

### కన్నంలో దొరికిన దొంగ చంద్రబాబు

లేని బలంతో తెలంగాణాలో ఎం.ఎల్.సి.ని గెలిపించుకునేందుకు చంద్రబాబు తెలుగు తమ్ముళ్ళను డబ్బిచ్చి టి.ఆర్.ఎస్. నామినేటెడ్ ఎం.ఎల్.ఎ. దగ్గరకు పంపించారు. డబ్బిస్తూ ఎ.సి.బి. అధికారులకు ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి దొరికిపోయాడు. చంద్రబాబే స్వయంగా మాట్లాడిన టేపులు టి.వీ.ల్లో దర్శనమిచ్చాయి. డబ్బిచ్చి ఓట్లు కొనడం చంద్రబాబుకి తప్పు కాదట. దొంగని పట్టుకునే పద్ధతే తప్పట. ఇలా ఉంది శ్రీరామచంద్రుడి తమ్ముడు, సత్యహరిశ్చంద్రుడికి బ్రదరు అయిన చంద్రబాబు వాదన. కన్నంలో దొరికిపోయి బయటపడడానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. తన దొంగతనాన్ని పట్టుకోవడం ఆంధ్రరాష్ట్ర ప్రజలను అవమాన పరచడమేనని డొంక తిరుగుడు వాదనలు చేస్తున్నారు.

### మహిళా తహసిల్దార్‌పై దాడి చేసిన ఎం.ఎల్.ఏ.ను బలపరుస్తున్న బాబు

డ్వాక్రా మహిళల పేరున టి.డి.పి. నాయకులకు ఇసుక అక్రమ వ్యాపారం అప్పజెప్పిన బాబు బహిరంగంగా మాత్రం ఇసుక మాఫియాలను పట్టుకోండని అధికారులకు హుకుంలు జారీ చేస్తున్నారు. ఈ మాయా మంత్రం తెలియని తహసిల్దార్ వనజాక్షి తెలుగుదేశం ఎమ్మెల్యే మాఫియాను పబ్లిక్‌గా పట్టుకున్నది. మాఫియా నాయకుడైన ఎమ్మెల్యే సహించలేకపోయాడు. తహసిల్దార్ వనజాక్షిని జుట్టుపట్టుకుని ఈడ్చుకుపోయాడు. మహిళ, మండల మెజిస్ట్రేట్‌పై పబ్లిక్‌గా దాడి చేసిన ఎమ్మెల్యేను కాపాడడానికి చంద్రబాబు తహసిల్దార్‌ని నువ్వెందుకు అక్కడకు వెళ్ళి అడ్డం పడ్డావని ఎదురు ప్రశ్నించారు. ఇదీ చంద్రబాబు నీతివంతమైన పాలన!

## జూలై 20న అవినీతి వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనండి!

అవినీతి, అక్రమాలకు ఆలవాలమైన కాంగ్రెస్‌కు భిన్నంగా నీతిమంతమైన పాలన అందిస్తామని ప్రచారం చేసారు. అధికారం చేపట్టిన నాటి నుండి బిజెపి, టిడిపిలు కాంగ్రెస్ దారిలోనే నడుస్తున్నాయి. దేశ, విదేశీ బహుళజాతి కంపెనీలు వేలకోట్లు ఖర్చు పెట్టి బిజెపిని గెలిపించుకున్నాయి. గెలిచిన తరువాత వారి రుణం తీర్చుకుంటున్నాడు మోడీ. అందువలనే దొంగల ముఠాకు సహకరించడం, తద్వారా తామూ వాటాలు పుచ్చుకోవడం జరుగుతున్నది. మతోన్మాదంలో తప్ప ఎందులోనూ తాము కాంగ్రెస్‌కు భిన్నం కాదని బి.జె.పి., టి.డి.పి.లు రుజువు చేసుకున్నాయి. బి.జె.పి., టి.డి.పి. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు జూలై 20న జిల్లా, మండల, పట్టణాల్లో జరిపే సభలు, ప్రదర్శనల్లో పాల్గొనవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

| | | |
|---|---|---|
| సి.పి.ఐ.(యం) | సి.పి.ఐ. | సి.పి.ఐ.(యం.ఎల్) న్యూడెమోక్రసీ |
| యం.సి.పి.ఐ.(యు) | ఆర్.ఎస్.పి. | సి.పి.ఐ.(యం.ఎల్) |
| సి.పి.ఐ.(యం.ఎల్) లిబరేషన్ | ఫార్వర్డ్‌బ్లాక్ | ఎస్.యు.సి.ఐ.(సి) |